# పల్లెల ప్రగతికి పాటుపడండి

**• తానాకు మంత్రి జానారెడ్డి పిలుపు**

చంద్రగిరి, న్యూస్‌టుడే: అన్ని రంగాల్లో అభివృద్ధి చేసేందుకు జిల్లాకో గ్రామాన్ని ఎంపిక చేసుకోవాలని పంచాయతీరాజ్, గ్రామీణ తాగు నీటి సరఫరా శాఖ మంత్రి కె.జానారెడ్డి ఉత్తర అమెరికా తెలుగు సంఘా(తానా)నికి పిలుపుని చ్చారు. తిరుపతి సమీపంలోని చంద్రగిరికోటలో శ్రీకృష్ణదేవరాయల పేరుతో రెండురోజుల పాటు నిర్వహిస్తున్న తానా ఉత్సవాల ప్రారంభో త్సవ కార్యక్రమంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని ప్రసంగించారు. గనులు, భూగర్భశాఖ మంత్రి గల్లా అరుణకుమారి జ్యోతి ప్రజ్వలన చేసి ఉత్సవాలను ప్రారంభించారు. తానా అధ్య క్షుడు జయరాం కోమటి సభకు అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా జానారెడ్డి మాట్లాడుతూ.. 'గ్రామీణ ప్రాంతాల్లో పరిస్థి తులు మారిపోతున్నాయి. ఆర్థిక సంక్షోభం, అనైక్యత, అవగాహన లోపాలతో అంతరాలు పెరిగిపోతున్నాయి. జిల్లాకో గ్రామాన్ని ఎంపిక చేసుకోండి. మీకు అందుబాటులో ఉన్న శాస్త్ర సాంకేతిక రంగాన్ని ఉపయోగించండి. భవిష త్తులో ఎదురయ్యే సవాళ్లకు దీటుగా పునర్ని ర్మాణ దిశగా అన్ని రంగాల్లో ఆ గ్రామాలను అభివృద్ధి చేయండి. మిగిలిన వాటి అభివృద్ధికి మార్గదర్శకులు కండి..' అని తానా సభ్యులను కోరారు. పట్టణాలు, నగరాలకే పరిమితమయ్యే ఉత్సవాలను పల్లెప్రాంతంలో నిర్వహించాలనే ఉద్దేశంతోనే చంద్రగిరి కోటను ఎంపిక చేసినట్లు మంత్రి గల్లా అరుణకుమారి చెప్పారు. ఒక ప్పుడు తానూ తానాలో సభ్యురాలినేనని అప్పటి తానాకు, ఇప్పటి తానాకు పోలికే లేదన్నారు. అప్పట్లో ఇక్కడి నుంచి ఉత్సవాలకు అమెరికా వచ్చే వారికి తమ ఇళ్లల్లోనే ఆతిథ్యమిచ్చేవాళ్ల మని ఒక్కొక్కళ్లు ఒక్కో వంట చేసుకుని తీసుకె ళ్లేవాళ్లమన్నారు. తానా అధ్యక్షుడు జయరాం కోమటి మాట్లాడుతూ తానా చరిత్రలో చంద్ర గిరి కోటలో నిర్వహిస్తున్న ఉత్సవాలు మరపు రాని ఘట్టంగా మిగిలిపోతాయని పేర్కొన్నారు. తానా భవిష్యత్తు అధ్యక్షులు ప్రసాద్ తోటకూర, సాంస్కృతిక విభాగం ఛైర్‌పర్సన్ విజయ ఆసూరి, జిల్లా కలెక్టర్ శేషాద్రి ప్రభృతులు కార్య క్రమంలో పాల్గొన్నారు.



జ్యోతి ప్రజ్వలన చేసి ఉత్సవాలను ప్రారంభి స్తున్న మంత్రి జానారెడ్డి. చిత్రంలో గల్లా అరుణకుమారి, కలెక్టరు శేషాద్రి తదితరులు



ఉత్సవాల్లో మాట్లాడుతున్న ఉత్తర అమెరికా తెలుగు సంఘం అధ్యక్షుడు జయరాం కోమటి

**అలరించిన శోభారాజ్ సంకీర్తనలు:** ప్రఖ్యాత గాయని, తితిదే ఆస్థాన విద్వాంసు రాలు శోభారాజ్ సంకీర్తనతో సాంస్కృతిక కార్యక్రమాలు ప్రదర్శనలు ఆరంభమయ్యాయి. 'ప్రారంభమితి ప్రణతి గణపతి.. స్వార్థమే లేని స్వకార్యమిది, స్వామి కార్యమిది..' అంటూ తానా సభలను దిగ్విజయం చేయాలని గణప తిని ప్రార్థిస్తూ కీర్తనను ఆమె సొంతంగా రాసి స్వరపరిచారు. శ్రీకాకుళం నుంచి వచ్చిన తప్పె టగుళ్ల బృందం శ్రీకృష్ణుని పుట్టుక, చెంచుభా మతో కేళీవిలాసం ప్రదర్శనలు ప్రేక్షకులను అల రించాయి. అనంతరం వివిధ పాఠశాలలకు చెందిన విద్యార్థులు నృత్య, వేషధారణలు ఆకట్టు కున్నాయి. శ్రీకృష్ణదేవరాయలు, అష్టదిగ్గజ కవులు, పరివార వేషధారణలు, చిన్నారి కారుణ్య నృత్య ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి.

# 'తానా' తందానా..!

తిరుపతి, న్యూస్‌లైన్:

• ప్రైవేట్ కార్యక్రమానికి సమాచారశాఖ సేవలు
• తానా ఉత్సవాల్లో అధికారుల అత్యుత్సాహం
• డీఏ, ఇంధన ఖర్చులు ప్రభుత్వానివి..!

ప్రైవేట్ ఉత్సవాలైన తానా సాంస్కృతిక ఉత్సవాల్లో జిల్లా ప్రభుత్వ శాఖలు తమవంతు గా పోటీ పడి సేవలు అందించాయి. రెవెన్యూ, డ్వామా, టీటీడీ శాఖలు ఈ వ్యవహారంలో ముందున్నాయి. వీరికేమీ తీసిపోమని రాష్ట్ర సమాచారశాఖ సైతం వాహనాలను పెట్టి, అధి కారులను కవరేజ్ కోసం పంపి, స్వామి భక్తి (అధికారభక్తి) చాటుకున్నారు. రాష్ట్ర శాసనసభక మిటీ కమిటీ వస్తే కూడా మీడియాను తీసుకె ళ్లేందుకు వాహనం పెట్టని సమాచారాశాఖ జిల్లా అధికారులు బుధవారం చంద్రగిరి కోటలో తానా చైతన్యస్రవంతి ప్రైవేట్ కార్యక్రమంలో పూర్తిస్థాయిలో సేవలు అందించి తరించారు. విలేకరులు అడగకముందే రోజుకు రెండుసార్లు వాహనాలు పెట్టి, నాలుగు సార్లు మెసేజ్‌లు ఇచ్చి కవరేజ్‌కు ఆహ్వానించారు. ప్రవాస భార తీయులు తమ పబ్లిసిటీ కోసం రాష్ట్రవ్యాప్తంగా చేస్తున్న ప్రైవేట్ ఉత్సవాలను అధికారికంగా నెత్తికెత్తుకోవాల్సిన అవసరం అధికారులకు ఏమొచ్చిందనే విమర్శలు బలంగా ఉన్నాయి. చంద్రగిరిలో తెలుగు అసోసియేషన్ ఆఫ్ నార్త్ అమెరికా (ప్రైవేట్ అసోసియేషన్) వారు వారి పబ్లిసిటీ కోసం రెండురోజుల పాటు తెలు గు వైభవం పేరుతో ఉత్సవాలు నిర్వహిస్తున్నా రు. దీనికి ప్రభుత్వ విధులకు ఏ రకంగానూ సం బంధం లేదు. చిత్తూరు నుంచి ఒక జిల్లా స్థాయి అధికారితో పాటు, మరో ఐదు మంది పాత్రికే యులను తీసుకెళ్లేందుకు ఉత్సాహంగా మెసేజ్ లు ఇచ్చారు. ప్రైవేట్ కార్యక్రమం అయినప్ప టికీ మంత్రులు పాల్గొంటున్నందున మీడియా కవరేజ్ కోసం విలేకరులను తీసుకెళ్లేందుకు వాహనం పెట్టామని సమాచారశాఖ అధికారు లు వివరణ ఇచ్చారు. రెండు రోజుల పాటు జిల్లా అధికారితో పాటు, సహాయ అధికారులు పని చేసినందుకు ఇచ్చే జీతం, డీఏ, వాహనాల ఇంధన ఖర్చులు కలిపి దాదాపు 30 వేలకు పైగా ఖర్చు తేలుతుంది. అసలే తెల్లపేపర్లుకు కూడా డబ్బులు లేక, లోటు బడ్జెట్‌తో ఉన్న సమాచార శాఖలో ఇలా రెండు స్వరాజ్ మజ్దా వాహనా లను తానా సభల కోసం తిప్పటం ఎంత వరకు సమంజసం అన్న ప్రశ్న తలెత్తుతోంది. జిల్లాకు చెందిన వివిధ అధికారులు వారం రోజుల నుంచి పరిపాలన పక్కన పెట్టి చంద్రగిరి కోట చుట్టూ తిరుగుతూ ఏర్పాట్ల పేరుతో ఇక్కడే కాలక్షేపం చేశారు. వీరి టీఏలు, డీఏల పేరిట వేలాది రూపాయలు ఆన్‌డ్యూటీ కింద డ్రా చేయడం ప్రభుత్వ నిధులకు నష్టం కిందే లెక్క.

**అధికారుల అత్యుత్సాహం**

తొలిరోజు తానా సభల ఉత్సవాల నిర్వహణలో జిల్లా అధికారులు అ త్యుత్సాహం చూపారు. ఒక జిల్లా అధికారి యాంకరింగ్ బాధ్యతలు నెత్తి కెత్తుకుని అన్ని తానై వ్యవహరించారు! గల్లా దృష్టిలో పడేందుకు ప్రయత్నించారు. మరికొందరు అధికారులు ఏర్పాట్ల పేరిట హడావుడి సృష్టించారు. ఇక పోలీసు లు చెప్పనవసరం లేదు. ట్రాఫిక్ డైవర్షన్ బోర్డులు పెట్టి స్థానికులు వాహనాలు రానీకుండా అడ్డుకున్నారు. దీనితో వచ్చినవారు కోట ఉత్సవాల వేదిక వద్దే తమ అసంతృప్తిని బాహాటంగా వ్యక్తం చేశారు. మొత్తానికి తానా అంటే తందాన అన్నట్టుగా వ్యవహరించారనే విమర్శలు వచ్చాయి.